## 27

# క్రైస్తవులు ప్రార్థించినప్పుడు

## (8:1-6)

త్వరత్వరగా ఒకదానివెంట ఒకటి మొదటి ఆరు ముద్రలు విప్పబడడం మనం 6వ అధ్యాయంలో చూచాం. తరువాత ప్రాముఖ్యమైన తిరుగు ప్రయాణం 7వ అధ్యాయంలో చేసి దేవుని ప్రజలు భూమిమీద ముద్రింపబడినట్టును పరలోకమందు దేవుని సింహాసనం యెదుట ఆనందిస్తున్నట్టును చూచాం. 8వ అధ్యాయంలో మొదటి ఆలోచనా విధానానికి తిరిగి వచ్చి ఏడవ ముద్ర విప్పబడడం చూస్తాం.

8వ అధ్యాయంలోని మొదటి ఆరు వచనాలు పలు ఉద్దేశాలను నెరవేర్చుతుంది:

(1) గ్రంథం యొక్క రెండవ భాగాన్ని అవి చుట్టి వస్తాయి (4:1–8:5);

(2) గ్రంథం యొక్క మూడవ భాగానికి అవి నడిపిస్తాయి (8:6–11:19);

(3) యుద్ధ సన్నద్ధులైయున్న క్రైస్తవుల కొరకు అవి ప్రత్యేకమైన సందేశాన్ని కలిగి ఉన్నాయి.

ఏడవ ముద్ర విప్పడాన్ని చర్చిస్తుండగా, మొదటి ఉద్దేశాన్ని చూద్దాం. ఆ తరువాత ఈ పాఠంలో, హింసింపబడుతున్న క్రైస్తవులకు ఈ వచనాలు ఏలాటి నిరీక్షణ యిస్తాయో వివరంగా చూస్తాం. ఈ స్టడీలోని ప్రధానమైన స్థానానికి వెళ్లక ముందు, ఓ క్షణంసేపు గ్రంథం యొక్క మూడవ భాగానికి నడిపించే రెండవ ఉద్దేశం మీద దృష్టి నిలుపవలసి యుంటుంది.

### సిద్ధపాటు యొక్క ఉద్దేశం (8:1, 2)

అధ్యాయం యిలా ఆరంభమౌతుంది, "ఆయన యేడవ ముద్రను విప్పినప్పుడు పరలోకమందు ఇంచుమించు అరగంటసేపు నిశ్శబ్దముగా ఉండెను. అంతట నేను దేవుని యెదుట నిలుచు ఏడుగురు దూతలను చూచితిని; వారికి ఏడు బూరలియ్యబడెను" (1, 2 వచనాలు). ఏడవ ముద్ర విప్పడం ఏడు బూరలు ఊదడానికి నడిపిస్తుంది – అలాగే తరువాత ఈ గ్రంథంలో, ఏడవ బూర మోగించడంతో ఏడు ఉగ్రత పాత్రలు పోయబడడానికి రంగం సిద్ధమౌతుంది (15, 16 అధ్యాయాలు).

బూరలు ఏడవ ముద్రను వెంబడించడం మాత్రమే గాక; అవి ఏడవ ముద్ర యొక్క ప్రాథమిక యాక్షన్‌గా ఉన్నట్టు కూడ తలంచవచ్చు.[1] "ఏడు బూరల గ్రూపు అంతా ఏడవ ముద్ర యొక్క సంగతులుగా కూర్చబడతాయి" అని Frank Pack చెప్పాడు.[2] "ఏడవ ముద్రలో ఏడు బూరలున్నాయి, ఏడవ బూరలో ఏడు పాత్రలున్నాయని" Jim

McGuiggan అన్నాడు. అతడు ఈ ప్రాథమిక అవుట్‌లైన్ను ప్రతిపాదించాడు:

I. మొదటి ముద్ర
II. రెండవ ముద్ర
III. మూడవ ముద్ర
IV. నాల్గవ ముద్ర
V. అయిదవ ముద్ర
VI. ఆరవ ముద్ర
VII. ఏడవ ముద్ర
    A. మొదటి బూర
    B. రెండవ బూర
    C. మూడవ బూర
    D. నాల్గవ బూర
    E. అయిదవ బూర
    F. ఆరవ బూర
    G. ఏడవ బూర
        1. మొదటి పాత్ర
        2. రెండవ పాత్ర
        3. మూడవ పాత్ర
        4. నాల్గవ పాత్ర
        5. అయిదవ పాత్ర
        6. ఆరవ పాత్ర
        7. ఏడవ పాత్ర[3]

ఏడు ముద్రలకు, ఏడు బూరలకు, ఏడు పాత్రలకు మధ్య విశేషంగా కన్పించే చాలా సమాంతరాలున్నాయి: ఈ ఏడుల్లో ప్రతిదీ నాలుగు, మూడు గ్రూపులుగా ఉంటాయి (ప్రతి వరుసలోను, మొదటి నాలుగు గురుతులు సన్నిహితమైన సంబంధం కలిగి ఉంటాయి, చివరి మూడు ఎక్కువ వ్యత్యాసంగా ఉంటాయి). "ఈ మూడు వర్ణనలు నిజంగా (అదే) ఒకే విషయాన్ని తెలుపుతాయి, తరచుగా ఒకే రకమైన సమాచారాన్ని కలిగి ఉంటాయి. కొన్నిసార్లయితే దాదాపుగా అన్యములు కానట్టుంటాయి."[4] పైగా, దేవుని శక్తిని నొక్కి పలికే ఒకే విధమైన మాటలతో అన్నీ ముగిస్తాయి (8:5;11:19; 16:18–21).

ప్రతి విషయములోను ఈ మూడు భాగాలు అన్యములు కానివి గనుక అనావశ్యకములు అని దాని అర్థం కాదు. "ఈ వరుసలో ప్రతిదానికి … దాని సొంతమైన వ్యక్తిగత" చర్చనీయాంశముంటుంది.[5] ఈ భాగాలు లాజికల్‌గా ముందుకు సాగుతాయి.[6] వాటి పురోగమనము ఈ విధంగా చెప్పవచ్చు:

(1) ముద్రలు విప్పబడ్డాయి: ప్రత్యక్షత.

(2) బూరలు ఊదబడ్డాయి: హెచ్చరిక.

(3) ఉగ్రత పాత్రలు కుమ్మరించబడ్డాయి: శిక్ష.

ప్రతి వరుస క్రమంలోని సందేశం ప్రాథమికంగా ఒక్కటిగానే ఉంది: దేవుడు అధికారియై ఉన్నాడు, ఆయన ప్రతిదానిని మేలుకొరకు మల్చుతాడు!

## ప్రార్థన యొక్క శక్తి (8:1-6)

ఇప్పుడు మనం మన పాఠం యొక్క ముఖ్యాంశానికి వచ్చాం. 8:1–6 స్టడీని నేను ఆరంభించినప్పుడు, సిద్ధపాటు యొక్క ప్రాముఖ్యత ప్రధానమైనట్టు నేను ఎదురు చూచాను. ఏడు బూరలు ఊదబడడానికి మన మనస్సులను సిద్ధపరచడానికి దేవుడు ఈ భాగాన్ని ఉపయోగించుకొంటున్నాడు. అలాగే, నీవు నేను యోగ్యమైన పనికి సిద్ధపడవలసి ఉంది. అది బహు ఉత్తమమైన చర్చనీయాంశమే, కాని ఈ వచనాలను నేను ఎంత ఎక్కువగా పఠించితే, ఆ భాగంలో యిమిడియున్న ప్రార్థనాశక్తి యొక్క ఉపదేశంతో అంతగా నేను యింప్రెష్ అయ్యాను. "క్రైస్తవులు ప్రార్థించినప్పుడు" ఏమి జరుగుతుందో అనేదాన్ని కేంద్రంగా ఉంచి నా ఆలోచనలను నేను పంచుకుంటాను.

### పరలోకం ఆలకిస్తుంది (1 వ.)

ఏడవ ముద్ర విప్పడంతో ఈ లేఖన భాగం ఆరంభమౌతుంది: "ఆయన యేడవ ముద్రను విప్పినప్పుడు పరలోకమందు ఇంచుమించు అరగంటసేపు నిశ్శబ్దముగా ఉండెను" (1 వ.).

ప్రకటనలో తరచుగా జరుగుతున్నట్టు, మనలో కొందరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. యోహానుతోపాటు పరలోక సింహాసనపు గదిలోనికి మనం వెంటపోయిన నాటనుండి (4:1, 2) మన మానసికమైన చెవులు శబ్దంతో దిబ్బెళ్లు పడిపోయాయి. 4, 5 అధ్యాయాలలో పరలోకపు పల్లవిని మనం ఆలకించాం. 6వ అధ్యాయంలో ఉరుముతుండిన డెక్కల ధ్వనులును, హతసాక్షుల కేకలును, విశ్వమంతా భీకర ధ్వనితో తునకలుగా పగిలిపోవడం మనం విన్నాం. 7వ అధ్యాయంలో, ఎన్నడూ లేనంత మహా సమూహము ఏకంగా చేరి మహా జయ గీతాన్ని ఆలపించడం. ఆ అధ్యాయాలలో, ప్రతిదీ "గొప్ప స్వరంతో" చెప్పబడింది లేక పాడబడింది (5:2, 12; 6:10; 7:2, 10).

తటాలున, అంతా నిశ్శబ్దమైపోయింది – సంపూర్ణంగాను, పూర్తిగాను నిశ్శబ్దం.[7] ఆ నిశ్శబ్దం "అరగంటసేపు కొనసాగింది." అరగంట అంత ఎక్కువ సమయమేమీ కాదు – ఏదైనా సంభవించాలని నీవు వేచియుండకపోతే. నీవు నీ బిడ్డను త్వరగా ఆస్పత్రికి తరలించి, బాగౌతుందా లేదా అనే డాక్టరు వాఙ్మూలము వినగోరి అరగంట ఆగవలసి వస్తే, ఆ అరగంట జీవిత కాలంలా తోస్తుంది. తరువాత ఏమి అని యోహాను వేచియుండగా చూస్తుండగా, పరలోక సంబంధమైన ఆ 30 నిమిషాలు యోహానుకు నిత్యత్వంలా కన్పించియుండవచ్చు.[8]

"అరగంటసేపు" అని ప్రయోగం యొక్క సింబాలిక్ ప్రాముఖ్యత వద్ద వ్యాఖ్యానకర్తలు పెనుగులాడారు. "దాని భావమేమి?" అని వారు బాధపడ్డారు. కథలో అది "ఏ ఉద్దేశాన్ని నెరవేర్చుతుంది?" అనేది శ్రేష్ఠమైన ప్రశ్నయై ఉంది. సంగీతపు గురుతులు ఉపయోగించే సింబల్స్‌ని ("rests") "విరామాలు" అంటారు. పాటకుడు గాని, సంగీత శాస్త్రిగాని విశ్రాంతికి వచ్చినప్పుడు, కొంచెంసేపు నిలుపుతాడు, దాన్ని విరామం (rest) అని అంటారు; అతడు ఎంతో కొంతసేపు మౌనంగా ఉంటాడు. "సంగీతంలో ఆ నిశ్శబ్దానికి అర్థమేమి?" అని ఎవరైనా అడిగినట్టు నేను వినలేదు. అయితే, ఆ నిశ్శబ్దం ఏదో జరిగించడానికి ఉందని మాత్రం మనం గ్రహించగలం: సంగీతమంతటిలో కొంత ప్రభావాన్ని చూపడానికి కలుపబడినట్టు, పాట యొక్క మూడ్‌కు కలపడానికి. అదేవిధంగా, నిశ్శబ్దం 8:1లోని ఉద్దేశం, రాబోయే ప్రత్యక్షత కొరకు కనిపెట్టడాన్ని అధికం చేయడానికి కావచ్చు.[9]

ఈ నిశ్శబ్దానికి అధికమైన ఉద్దేశాన్ని కొందరు వ్యాఖ్యానకర్తలు ప్రతిపాదించారు. "పరలోకంలో నిశ్శబ్దంగా ఉండడానికి కారణం సందర్భం సప్లయ్ చేస్తుందని, ఒక వచనం తరువాత ప్రార్థన అనే అంశంచే డామినేట్ చేయబడిందని … ఆ నిశ్శబ్దం సంపూర్ణంగా న్యాయమైన ప్రార్థనలు తీవ్రంగా ఆలకించడానికని" G. R. Beasley-Murray గుర్తించారు.[10] William Barclay యిలా రాశాడు,

> పరిశుద్ధుల ప్రార్థనలు దేవుని సముఖానికి పోబోతున్నాయి; పరిశుద్ధుల ప్రార్థనలు వినబడునట్టుగా పరలోకంలో ఉన్న ప్రతిదీ స్తంభించిపోయినట్టుంది … తనను నమ్ముకున్న కడు దీనులైన ప్రజల గుసగుసల ప్రార్థనలను దేవుని చెవి పట్టుకొనునట్లు పరలోకపు సంగీతమేనా, కడకు ప్రకటన యొక్క ఉరుములు సయితం నిలిచి పోయాయి.[11]

"భూమిమీదనున్న ఆ పరిశుద్ధుల ప్రార్థనలు వినబడడానికి గాను, పెద్దలతోను, నాలుగు జీవులతోను కలిసిన దూతల సమూహపు స్తుతులును నిలిచిపోయాయి."[12] అని Frank Pack సమ్మతించాడు.

దానికి నీవు ఆక్షేపణ చేయవచ్చు, "తన ప్రజల ప్రార్థనలు ఆలకించడానికి దేవునికి సంపూర్ణ నిశ్శబ్దం అక్కరలేదు." అది నిజమే, అయితే యిది సింబాలిక్ అనే సంగతి గుర్తుపెట్టుకో. మనం గౌరవించే మనుష్యులు మాట్లాడుతుండగా, ఆలకించడానికి అనుకూల పరిస్థితులను కల్పించుకొంటాం: మనం చేస్తున్న పనిని నిలిపివేస్తాం; నెమ్మదిగా ఉండమని మన పిల్లలకు చెప్తూతాం, రేడియోను లేక టెలివిజన్ను ఆపివేస్తాం. అలాగే తన పరిశుద్ధుల మనవి తేటగా వినగలుగునట్లు పరలోకాన్నీ భూమినీ సందడి చేయవద్దని దేవుడు అన్నట్టు సింబాలిజం మనకుంది.[13] ఈ చిత్రం నా హృదయాన్ని తాకుతుంది. Eugene Peterson యిలా రాశాడు,

> మనం సందడిగా ఉన్న లోకంలో జీవిస్తున్నాం. మనమీద అరుపులు పడతాయి, ప్రోత్సాహం, పిలుపు వస్తుంది. ప్రతివానికి మనకొరకు అర్జెంట్ సందేశముంటుంది. మనం శబ్దంతో చుట్టబడియున్నాం: టెలిఫోను, రేడియో, టెలివిజన్, స్టీరియో. చెవులు దిబ్బెళ్లుపడేలా సందేశం బిగ్గరగా పెట్టబడుతుంది. లోకము అల్లరి చేయు జనుల గుంపుతో కూడియుంది. ఇందులో ప్రతివాడు ఒక్కసారిగా మాట్లాడగోరి ఎవడును

వినడానికి యిష్టపడడం గాని, లేక వినగలగడం గాని లేదు. అయితే దేవుడు ఆలకిస్తాడు ... ఆయన మనతో మాట్లాడడం కంటెను ఆయన ఆలకిస్తాడనేది అధికమైన ఆశ్చర్యం ... .

మనం చెప్పే ప్రతిదీ, ప్రతి మూలుగు, ప్రతి గొనుగుడు, ప్రార్థనలో నత్తిగా అనే ప్రతి ప్రయత్నం: యిదంతా ఆలకించబడుతుంది. బిగ్గరయైన దూత స్వరాలు, గుచ్చుకొని పోతుండే బూర సందేశాలు ఉరుముతున్న సింహాసనము గీతాలన్నీ దేవుడు ఆలకించి నప్పుడు, పరలోకమంతా నిశ్శబ్దమౌతుంది.[14]

ముప్పై నిమిషాల్లో ఎంతో ఉన్న నిశ్శబ్ద కాలంతో యిది గుప్తమైయుందో లేదో కాని, తనకు ప్రత్యేకమైనవారి ప్రార్థనలు ఆలకిస్తాడని మాత్రం ఈ వాక్య భాగం మొత్తం మీద ప్రకటిస్తుంది. బాధింపబడుతున్న "నాటి నేటి పాఠకులకు యోహాను ఏమి చెప్పుతున్నాడంటే, వారి ప్రార్థన పరలోకమందు వినిపిస్తుంది, వారికి తమ జవాబు వస్తుంది. దేవుడు చచ్చినవాడు కాడు, చెవిటివాడు కాడు, పట్టించుకోనివాడు అంతకంటె కాడు."[15]

బైబిలు అంతటిలో దేవుడు తన ప్రజల విన్నపాలు వింటాడనే అద్భుతమైన సత్యం బోధించబడుతుంది. "నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించునని" సామెతలు అంది (15:29). దేవుడు సొలొమోనుకు యిలా తెలిపాడు, "–నా సముఖమందు నీవు చేసిన ప్రార్థన విన్నపములను నేను అంగీకరించితిని" (1 రాజులు 9:3ఎ). ఆయన హిజ్కియాకు ఈ వర్తమానం పంపాడు, "నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని; నీ ప్రార్థన నేనంగీకరించి యున్నాను" (2 రాజులు 20:5బి). నమ్మకమైన తన దాసుల ప్రార్థనలను యాచనలను దేవుడు ఆలకిస్తాడు. పేతురు యిలా రాశాడు, "**ప్రభువు** కన్నులు నీతిమంతులమీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి" (1 పేతురు 3:12ఎ). యోహాను ఏకీభవించాడు: "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5:14). ఆది క్రైస్తవ ప్రార్థన యొక్క ప్రత్యేకమైన లక్షణం తప్పక ఆలకించబడడమనేదే.[16]

మనం ప్రార్థించినప్పుడు పరలోకం ఆలకించునని ఎరగడం ఆశ్చర్యం కాదా?

### పరలోకం ఆనందిస్తుంది (3, 4 వచనాలు)


క్రైస్తవులు ప్రార్థించినప్పుడు పరలోకం ఆనందిస్తుందని కూడ ఈ లేఖనం ప్రకటిస్తుంది.

2వ వచనంలో, ఏడుగురు దూతలకు బూరలియ్యబడ్డాయి; కాని వారు ఆ బూరలు ఊదడానికి అనుమతి పొందక ముందు, మరొక దూత రంగ ప్రవేశం చేశాడు:[17]

మరియు సువర్ణధూపార్తి చేత పట్టుకొనియున్న వేరొక దూతవచ్చి బలిపీఠము ఎదుట నిలువగా సింహాసనము ఎదుట ఉన్న సువర్ణ బలిపీఠముపైన[18] పరిశుద్ధులందరి ప్రార్థనలతో[19] కలుపుటకై అతనికి బహు ధూపద్రవ్యములు[20] ఇయ్యబడెను.[21] అప్పుడా ధూప ద్రవ్యముల పొగ పరిశుద్ధుల[22] ప్రార్థనలతో కలిసి దూత చేతిలోనుండి పైకి లేచి దేవుని సన్నిధిని చేరెను (3, 4 వచనాలు). (పేజీ 199 చూడు.)

ఈ సింబాలిజం పాత నిబంధననుండి తీయబడింది. గుడారములోని పరిశుద్ధ స్థలము యొక్క లోపల ఉండే బంగారు బలిపీఠమును సువర్ణ బలిపీఠమంటారు (నిర్గమకాండము 30:1-8). అది చిన్న బలిపీఠము, రమారమి 3 అడుగుల ఎత్తును, ఎటు చూచినా 18 అంగుళాల వెడల్పుగలదై కొయ్యతో చేయబడి బంగారు రేకుతో పొదగబడింది. (ధూపార్తి) అని పిలువబడే ఒక నిప్పుల పళ్లెం బలిపీఠం పెట్టబడేది, ధూపద్రవ్యం ఆ పళ్లెంమీద కాల్చబడేది.

ఈ బలిపీఠము పరిశుద్ధ అతిపరిశుద్ధ స్థలాలను విభాగించే తెరకు ముందు నేరుగా ఉంచబడుతుంది.[23]




ప్రత్యేకింపబడిన సమయాల్లో, యిత్తడి బలిపీఠము (దహన బలిపీఠం) నొద్దకు యాజకుడు వెళ్లి బలిపీఠపు నిప్పులతో యాజకుడు ధూపార్తిని నింపుకుంటాడు (లేవీయకాండము 16:12; సంఖ్యాకాండము 16:46ను[24] కూడ చూడు). అటు తరువాత అతడు ఆ ధూపార్తిని ధూపద్రవ్యాన్ని తీసుకొని పరిశుద్ధ స్థలం లోపలి భాగానికి వచ్చి ధూపవేదిక మీద ధూపార్తిని ఉంచి, ధూపద్రవ్యపు పొడిని ధూపార్తి మీదనున్న నిప్పులపై చల్లుతాడు (లేవీయకాండము 10:1 చూడు). వెంటనే, మనోహరమైన సువాసన పరిశుద్ధ స్థలాన్ని నింపుతుంది, అతిపరిశుద్ధ స్థలంలోనికిని చూచుకొనిపోతుంది. అతిపరిశుద్ధ స్థలములో నిబంధన మందసం[25] ఉంటుంది, దానిపై కరుణాపీఠముంటుంది: దేవుడు తన ప్రజలను కలుసుకొనడానికి వాగ్దానం చేసిన చోటు (నిర్గమకాండము 25:17-22; 26:34 చూడు). సువాసనగల పరిమళము నిజంగా దేవుని సముఖానికే వెళ్లుతుందని యూదుల భావన.[26]

దాదాపుగా ఆరంభంనుండి, బంగారు బలిపీఠం (ధూపవేదిక) మీద దహించబడే ధూపద్రవ్యం, దేవుని సముఖానికి ప్రార్థనలు ఎక్కిపోయేదానితో సంబంధమున్నట్టు భావింపబడింది. "నా ప్రార్థన ధూపమువలెను ... నీ దృష్టికి అంగీకారములగును గాక" అని దావీదు రాశాడు (కీర్తనలు 141:2ఎ). దేవాలయం నిర్మింపబడిన తరువాత, ధూపద్రవ్యాన్ని నిప్పులమీద వేసే రోజుకు రెండు సార్లు వైదిక కర్మ సమయంలో (నిర్గమకాండము 30:7, 8), ప్రార్థన కొరకు స్త్రీల ప్రాంగణంలో చేరేవారు. లూకా 1లో, జెకర్యా ధూపం

వేయడానికి దేవాలయంలోనికి వెళ్లినప్పుడు (5, 8, 9, 11 వచనాలు), "ప్రజల సమూహమంతయు వెలుపల ప్రార్థన చేయుచుండగా" (10 వ.). ధూపద్రవ్యము ప్రార్థనలతో కలపడం అనే అలంకారం ఆది క్రైస్తవులకు, ప్రత్యేకించి యూదుల పూర్వ చరిత్రగలవారికి బాగా ఎరుకైయుంటుంది.[27]

ప్రకటన 5లో యిరువది నలుగురు పెద్దలు "ధూప ద్రవ్యములతో నిండిన సువర్ణ పాత్రలను" పట్టుకొనియున్నట్టు చిత్రిస్తుంది. ఈ పాత్రలు "పరిశుద్ధులు ప్రార్థనలని" వివరిస్తుంది (8 వ.). 8వ అధ్యాయంలో ఈ వర్ణన కొద్దిగా మారింది: ఇక్కడ ధూప ద్రవ్యము పరిశుద్ధుల ప్రార్థనలతో కలుపబడి, "ధూప ద్రవ్యముల పొగ పరిశుద్ధుల ప్రార్థనలతో కలిసి దూత చేతిలోనుండి పైకి లేచి దేవుని సన్నిధికి చేరెను" (3, 4 వచనాలు). ప్రార్థనలకు, ధూప ద్రవ్యాలకు మధ్య వ్యత్యాసం చూడాలంటే, ధూప ద్రవ్యముల పొగ క్రీస్తు మరియు పరిశుద్ధాత్మ మన పక్షముగా చేయు విజ్ఞాపనకు సూచన (రోమా 8:26, 34; హెబ్రీ. 7:25; 1 యోహాను 2:1 చూడు). "అనేకసార్లు భావించినట్టు ప్రార్థన ఒంటరి సాహసం కాదు. అందులో పరలోకపు సహాయం ఉంది, మన ప్రార్థనలు దేవుని సన్నిధికి చేరుతాయి" అని Leon Morris గుర్తించాడు.[28]

బలిపీఠము ధూపము అనే చర్చ చెప్పబడే పాయింటునుండి మనలను తొలిగించ కూడదు: క్రైస్తవులు ప్రార్థించినప్పుడు, పరలోకం ఆనందిస్తుంది! పాత నిబంధన భాషలో, ధూపాన్ని దేవుడు ఇంపైన సువాసనగా ఆఘ్రాణిస్తాడు;[29] అలాగే, ప్రార్థనలు ఆయన చెవికి యింపుగా ఉంటాయి లేక ఆయన దృష్టికి అంగీకారంగా ఉంటాయి. "యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము" (సామెతలు 15:8బి). నీవు ప్రార్థించి నప్పుడు పరలోకం ఆనందిస్తుంది.

**పరలోకం జవాబిస్తుంది (5, 6 వచనాలు)**

ప్రతిదాన్ని గూర్చి ప్రార్థించుడని దేవుడు మనలను కోరతాడు: "దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" (ఫిలిప్పీయులకు 4:6). "అది ఆలోచింప తగిందయితే, అది ప్రార్థించ తగినది."

ప్రకటన 8 తొలి భాగంలో, పరిశుద్ధులచే ప్రత్యేకమైన ప్రార్థన చేయబడినట్టు విదితమై ఉంది. బలిపీఠము క్రింద వధింపబడినవారు "–నాథా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలువేసిరి" (6:9, 10). ప్రార్థనల వెంట ఏమి వచ్చిందో దాన్నిబట్టి మనం ఈ తీర్మానానికి వచ్చాం:

> ఆ దూత ధూపార్తిని తీసికొని, బలిపీఠముపైనున్న నిప్పులతో దానిని నింపి,[30] భూమిమీద పడవేయగా ఉరుములు ధ్వనులు మెరుపులు భూకంపమును కలిగెను.
>
> అంతట ఏడు బూరలు పట్టుకొనియున్న ఆ యేడుగురు దూతలు ఊదుటకు సిద్ధపడిరి (5, 6 వచనాలు).

"భూమి" అనే ప్రయోగం తిరిగి జన్మించినవారి పరిధిని సూచిస్తుంది.[31] "యెందాక … మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయుందువని" హతసాక్షులు అడిగారు. బలిపీఠమునుండి నిప్పులను "భూమిమీద" పడవేయడం, క్రైస్తవులను వ్యతిరేకించినవారికి విరోధంగా ప్రతిదండనను సూచిస్తుంది.[32]

ఆ అగ్ని భూమిని తాకినప్పుడు, "ఉరుములు ధ్వనులు మెరుపులు భూకంపమును కలిగెను." 4వ అధ్యాయంలో "దేవుని సింహాసనమునుండి మెరుపులును ధ్వనులును ఉరుములును బయలుదేరుచున్నట్టు" మనం చూచాం (5ఎ వ.). చలింపబడనివని ప్రజలు భావించే దానిని చలింపజేయడానికి భూకంపము గురుతైయున్నట్టు 6వ అధ్యాయంలో గుర్తించాం.[33] ఈ పదాలన్నీ కలిసి అమలు చేయడం దైవికమైన తీర్పు అనే భావనైయుంది.

ఇదంతయు చేరి ఏడు బూరల హెచ్చరికల ఉద్రేకపూరిత మోతలకు రంగం సిద్ధమయ్యింది.[34] అవిశ్వాసులైనవారికి దైవ సందేశం తేటపరచబడింది: మీరు నా ప్రజలకు హాని చేస్తే, మీరు నాకు బదులివ్వాలి!

5, 6 వచనాల్లోని సందేశం ఆది క్రైస్తవ పాఠకులకు బహుగా అవసరమైయుంది. "హింసకు సంబంధించిన పెద్ద యంత్రాలు, అపహాస్యము వారికి విరుద్ధంగా బారులు తీర్చబడ్డాయి. వారికి డబ్బు అంతగా లేదు, గౌరవం అంతకంటె లేదు."[35] "రోమా అధికారాన్ని ఎదుర్కొనడానికి మన యొద్ద ఏముంది?" అని వారిలో కనీసం కొందరైన అడుగవచ్చు. ప్రకటన 8 యొక్క జవాబు "ప్రార్థించు!" ఆలోచనను రేకెత్తించే ఈ మాటలను Thomas Torrance రాశాడు:

> లోకం వెనుక నిజంగా లోబరచుకొన శక్తులేమున్నాయి మరియు మన గమ్యానికి సంబంధించిన గాఢమైన రహస్యాలేమున్నాయి? ఇక్కడ ఆశ్చర్యకరమైన జవాబు ఉంది: పరిశుద్ధుల ప్రార్థనలు, దేవుని అగ్ని ఉన్నాయి. … ఎక్కువ బలమైన, లోకంలో వదలి పెట్టబడిన శక్తివంతమైన అంధకార సంబంధమైన శక్తులన్నిటికంటెను అధికమైన శక్తి గలది, ప్రార్థనలచే మండింపబడినదై భూమిమీదికి పడవేయబడిన దేవుని అగ్నియై ఉంది … .
>
> … పరిశుద్ధుల ప్రార్థనలు మరియు దేవుని అగ్ని లోకము యొక్క గమనమంతటిని కదిలిస్తుంది. అవి అత్యంత బలముగలవి, అత్యధికంగా కలతపెట్టునవి, బహుగా విప్లవకరమైనవి, లోకము ఎరిగినవాటిలో బహు భయానకమైనవి. క్రీస్తు సంఘములో ఉన్న మనం ఆ విధంగా నిజంగానే ప్రార్థనా శక్తిని ఎరుగుట దేవుడు యిష్టపడతాడు! …[36]

క్రైస్తవులు ప్రార్థించినప్పుడు, పరలోకం ఆలకించడం మాత్రమే కాదు, పరలోకం ఆనందించడం మాత్రమే కాదు, పరలోకం జవాబిస్తుందని బైబిలు బోధిస్తుంది. దేవుడు మన ప్రార్థనలకు జవాబిస్తాడు! "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" అని యేసు అన్నారు (మత్తయి 7:7). "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును" అని యాకోబు తెలిపాడు (యాకోబు 5:16బి). "… మనమేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును" అని యోహాను స్పష్టంగా చెప్పాడు (1 యోహాను 3:22ఎ). అతడింకను యిలా అన్నాడు,

> ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది

అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగిన యెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము (1 యోహాను 5:14, 15).

ఈ లేఖన భాగాలను మనం నమ్ముతామా? ప్రార్థన శక్తియందు మనం నమ్మిక యుంచుతామా?

ప్రకటన 8:1–6 ప్రార్థనపై పలు రచయితలచే ఈ కామెంట్లను ప్రేరేపించాయి:

దేవుని ఏలుబడిలో, క్రైస్తవుడు నేరుగా పాలుపుచ్చుకునే ఒక రూపము ప్రార్థన.[37]

భూమిమీద బహు శక్తివంతమైన ప్రభావము ప్రార్థనదే; మనుష్యులచే గమనింపబడినా లేకున్నా, భూమిమీద ప్రాముఖ్యమైన సంఘటనలు క్రైస్తవ ప్రార్థనలతో సంబంధం లేనివి ఏవీ లేవు.[38]

[దుష్టత్వంతో జరిగే పోరులో,] క్రైస్తవుని రహస్య ఆయుధము విశ్వాస సహితమైన ప్రార్థనకు దైవికమైన జవాబే.[39]

[బాధ కలిగినప్పుడు,] ఎవరైనా చేయగల ప్రాక్టికల్ విషయం ప్రార్థనయే.[40]

ఎవడు ఎక్కువ దూరం దూకగలడో అనే పందెంలో ఒకనాడు యిద్దరు పిల్లలు పాల్గొన్నారు. తరువాత, గెలిచిన బాలుడు తన తొలి స్థానపు బహుమానాన్ని తిరిగి యిచ్చాడు. “నేను మోసగించాను,” “నేను దూకక ముందు ప్రార్థించాను” అని అతడన్నాడు. అతడు మోసగించలేదు, కాని అతడు వేరు విధంగా చేయలేని దానిని ప్రార్థించి చేయగలిగినట్టు అతడు గ్రహించాడు – ఇది మనమందరం నేర్చుకొనవలసిన ప్రార్థనయై ఉంది. క్రైస్తవులు ప్రార్థించినప్పుడు, పరలోకం బదులిస్తుంది, దేవునికి స్తోత్రము!

## ముగింపు

కీర్తనలు 55లో దావీదు దేవునికి తన హృదయాన్ని కుమ్మరించాడు:

నా మనవి ఆలకించి నాకుత్తరమిమ్ము. శత్రువుల శబ్దమును బట్టియు దుష్టుల బలాత్కారమునుబట్టియు నేను చింతాక్రాంతుడనై విశ్రాంతి లేక మూలుగుచున్నాను. వారు నామీద దోషము మోపుచున్నారు ఆగ్రహముగలవారై నన్ను హింసించుచున్నారు.
నా గుండె నాలో వేదనపడుచున్నది మరణభయము నాలో పుట్టుచున్నది. దిగులును వణకును నాకు కలుగుచున్నవి; మహా భయము నన్ను ముంచివేసెను. ఆహా గువ్వవలె నాకు రెక్కలున్నయెడల నేను ఎగిరిపోయి నెమ్మదిగా నుందునే (2–6 వచనాలు).

దావీదువలె నీవెప్పుడైనా జీవితంచేత సంపూర్ణంగా ముంచివేయబడినట్టు ఫీలయ్యావా? తాను కొనసాగించుతూ కీర్తన రచయిత తన విశ్వాసాన్ని ఎలా వ్యక్తపరచాడో ఆలకించు: “... అయితే నేను దేవునికి మొఱ్ఱపెట్టుకొందును యెహోవా నన్ను రక్షించును

… ఆయన నా ప్రార్థన నాలకించును" (16, 17 వచనాలు). తన ముగింపు తీర్మానమేమి? "నీ భారము యెహోవామీద మోపుము, ఆయనే నిన్ను ఆదుకొనును; నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనీయడు" (22 వ.). మన లేఖన భాగములోని ప్రాథమిక సత్యాలను దావీదు ఎరుగును. దేవుని ప్రజలు ప్రార్థించినప్పుడు, పరలోకము ఆలకిస్తుంది, పరలోకము ఆనందిస్తుంది, పరలోకము బదులిస్తుంది.

ఈ గొప్ప సత్యాలను అంగీకరించడంవలన మన జీవితాలు ప్రభావితమౌతాయి. ఒక ఫలితమేమంటే మనం ఎక్కువగా ప్రార్థిస్తాం. రాగల మరొక ఫలితమేమంటే, దేవునితో మనకున్న సంబంధం సరియైనదిగా ఉండేలా సరిచూచుకొంటాం. "భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును" (సామెతలు 15:29). దేవుని నీవు "తండ్రీ!" అని పిలువక ముందు, నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను నీవు జన్మించియుండాలి (యోహాను 3:3, 5); పాపక్షమాపణ నిమిత్తము నీవు నీటిలో ముంచబడవలసి ఉంది (అపొస్తలుల కార్యములు 2:38).

నీవు దేవుని బిడ్డగా మారాలన్నా, లేక తప్పిపోయిన బిడ్డగా దేవుని యొద్దకు తిరిగి రావాలన్నా, నీవు దానిని నేడే చేయాలని నా ప్రార్థన!

---

## ఉపదేశకులకు, సువార్తికులకు నోట్సు

Torrance చే ఉపయోగింపబడిన ప్రయోగం ఈ పాఠానికి మంచి పేరైయుంటుంది: "పరిశుద్ధుల ప్రార్థనలు, దేవుని అగ్ని."[41] Earl Palmer విశేషమైన పేరు పెట్టాడు: "The Silence and the Sound."[42] "The Silence and the Thunder of Prayer" అని William Barclay ఉపయోగించాడు.[43]

---

సూచనలు

[1]1వ వచనంలో ఏడవ ముద్ర యొక్క యాక్షన్ సంపూర్తి అయ్యిందని కొందరు వ్యాఖ్యానకర్తలు అంటారు, ముద్ర విప్పినప్పుడు మాత్రమే నిశ్శబ్దం వస్తుందట. ఇలా జరుగవచ్చు, కాని ఏడవ ముద్ర యొక్క యాక్షన్ కొనసాగింపబడుతున్నట్టు సందర్భం యిష్టపడుతుంది. మొదటిగా, రెండవ వచనం క్రొత్త పేరాగ్రాఫును ఆరంభించదు; పైగా, 1, 2 వచనాలు అదే పేరాలో భాగమైయున్నాయి. రెండవదిగా, పరిస్థితికి సంబంధించిన 5వ వచనపు భాష ఏడవ బూర ఊదబడే (11:19), ఏడు పాత్రలు కుమ్మరింపబడే (16:18–21) ఉన్నత స్థాయికి సమాంతరంగా ఉంటుంది. అంటే, ఏడవ ముద్రలోని యాక్షన్ కనీసం 5వ వచనంవరకు వెళ్లుతున్నట్టు అది సూచిస్తుంది – అందులో 2వ వచనం – దూతలకు ఏడు బూరలు యివ్వబడినది చేర్చబడింది. [2]Frank Pack, *Revelation, Part 1*, The Living Word Series (Austin, Tex.: R. B. Sweet Co., 1965), 73. [3]Jim McGuiggan, *The Book of Revelation*, Looking Into the Bible Series (Lubbock, Tex.: International Biblical Resources, 1976), 97-98. [4]Martin Kiddle, *The Revelation of St. John,* The Moffatt New Testament Commentary Series (New York: Harper & Brothers, Publishers, 1940), 128-29. నీవు అమెరికాలో ఉంటే టివీలో ఆటలను "రీప్లే" చేయడం అనే ఉదాహరణను ఉపయోగించు. ఒకే ఆటను వెవ్వేరు కోణాలలో చూపడం జరుగుతుంది. [5]Ibid. [6]ఈ కార్య సిద్ధి యొక్క ప్రాధాన్యత తరువాత నొక్కి చెప్పబడుతుంది. [7]లెక్కింప శక్యము కాని సమూహాము యొక్క ఆరాధన "రాత్రింబగళ్లు" (15 వ.) – అంటే ఆగకుండ కొనసాగుతున్నట్టు 7వ అధ్యాయం అంటుంది. [8]ప్రకటన, 1వ పుస్తకంలో "ఇక్కడ

ఘటసర్పాలుంటాయి" అనే పాఠంలో "గంట" అనే పదము యొక్క సింబాలిక్ ప్రాధాన్యత క్లుప్తంగా తాకబడింది. అయితే "అరగంట" ప్రస్తావించబడలేదు. "ఇంచుమించు అరగంటసేపు" అని యోహాను ప్రస్తావించడంలో, అందులో "లోతైన" సింబాలిక్ ప్రాముఖ్యత లేదని తేలుతుంది. ఉద్రేకపూరితమైన ఫలితం కొరకు కొద్ది నిశ్చయం కాని కాలపు నిశ్శబ్దము సూచింపబడింది. [9]నిశ్శబ్దంలోని యితర ఉద్దేశాలను కూడ ఆలోచింపవచ్చు: (1) దుష్టులను మారుమనస్సుకు నడిపించడం బూరల యొక్క ముఖ్య ఉద్దేశమైయుండగా, అరగంటసేపు నిశ్శబ్దం, మారుమనస్సు పొందునట్లు దేవుడు మానవాళికి సమయమిచ్చిన దేవుని ఓర్పుకు గురుతైయున్నట్టు కొందరు తలంచారు. (2) నిత్యత్వాన్ని గూర్చి అనేక వాస్తవాలు మనకు తెలియవు తెలుసుకోలేమని నిశ్శబ్దం మనకు గుర్తు చేస్తుందని, ఏడవ ముద్ర యొక్క యాక్షన్ అంతా 1వ వచనంలో కన్పిస్తుందనేవారు నమ్ముతారు. (3) అత్యంత భక్తి మర్యాదలను కొందరు నిశ్శబ్దంలో చూస్తారు. [10]G. R. Beasley-Murray, *The Book of Revelation,* The New Century Bible Commentary Series (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1974), 150.

[11]William Barclay, *The Revelation of John,* vol. 2, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1976), 40. [12]Pack, 73. See also Eugene H. Peterson, *Reversed Thunder* (San Francisco: HarperCollins Publishers, 1988), 87. [13]"ఇశ్రాయేలీయుల స్తుతులు పరమందు వినబడునట్లుగా … దేవదూతలు పాటలు పాడుట నిలిపివేయబడినట్టు టాల్ముడ్ (Talmud)లో ఒక రెఫరెన్సు ఉంది." (Robert Mounce, *The Book of Revelation,* The New International Commentary on the New Testament Series [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1977], 179). [14]Peterson, 93. [15]Albert H. Baldinger, *Preaching From Revelation: Timely Message for Troubled Hearts* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1960), 40. [16]Peterson, 94. [17]ఏడవ ముద్ర విప్పడానికి (8:1), ఉరుము ధ్వనులు వచ్చేదానికి (8:5) మధ్య పూర్తిగా నిశ్శబ్దం ఉన్నట్టు కొందరు తలంచుతారు. అలాగైయున్నట్టయితే, యాక్షన్ యొక్క తాకుడు చేర్చబడియుండేదే. [18]ఈ దృశ్యము "బలిపీఠము క్రింద" హతసాక్షుల ఆత్మల దృశ్యంతో సంబంధం కలిగియుంటుంది (9 వ.). 6:9–11ను మనం చర్చించినప్పుడు, పాత నిబంధనలోని దహన బలులు అర్పించే యిత్తడి బలిపీఠపు దృశ్యాన్ని సూచిస్తుందని అన్నాం. ప్రకటనలో ఒకే ఒక బలిపీఠము చర్చించబడినట్టుందని మనం గుర్తించాం. కొన్నిసార్లు అది ధూపము వేయు సువర్ణ బలిపీఠంగాను, కొన్నిసార్లు యిత్తడి బలిపీఠంగాను చిత్రించబడినట్టుంది. Mounce యిలా అన్నాడు, "యోహాను దర్శనములోని రెండు [బలిపీఠాలు] ఒక్కటిగా కలగలుపు చేయకుండుటకు ఏ హేతువు లేదు" (157). 8:1–5లోని బలిపీఠానికి సంబంధించి, Pack యిలా రాశాడు, "రెండు వ్యత్యాసమైన బలిపీఠాలు ఈ భాగంలో కన్పిస్తున్నాయనేది సందేహం, బంగారు బలిపీఠము, దహన బలియొక్క బలిపీఠముకున్న లక్షణాలు ఈ బలిపీఠమునందు కలుపబడ్డాయి" (74). 6వ అధ్యాయంలోని బలిపీఠానికి తారతమ్యంగా, 8వ అధ్యాయంలోని బలిపీఠము ధూపవేదిక యొక్క గుణాలు ఎక్కువగా ఉన్నాయి. [19]ఈ దృశ్యం 6వ అధ్యాయంలో "ఎందాక?" అని ప్రశ్నించిన హతసాక్షుల దృశ్యంతో సంబంధం కలిగియుంటుంది (9, 10 వచనాలు). అయినా గమనించు, యిక్కడ ప్రార్థనలు "పరిశుద్ధులందరి" ప్రార్థనలైనప్పటికి, కేవలం హతసాక్షులవి మాత్రమే కాదు. [20]"బహు ధూపద్రవ్యము" దూతకు యివ్వబడిన వాస్తవం, యూదులు ప్రాయశ్చిత్త దినమునుండి సింబాలిజం తీయబడిందని కొందరు కామెంటేటర్లు ఒప్పింపబడ్డారు. ఎందుకంటె ప్రాయశ్చిత్త దినాన తక్కిన దినములలోకంటెను ఎక్కువైన ధూపద్రవ్యం పరిశుద్ధ స్థలంలోనికి కొనిపోబడేది.

[21]దూతలు క్రైస్తవుల పక్షముగా విజ్ఞాపన చేస్తారని చెప్పడానికి కొందరు ఈ లేఖన భాగాన్ని వినియోగించుకున్నారు. ఏదియెలాగున్నా, ధూపద్రవ్యం దూతయొద్దనుండి కలిగింది కాదు, అది అతనికి యియ్యబడింది. దూత కేవలం సింహాసనంనుండి యివ్వబడిన ఆజ్ఞలను జరిగించే దాసుడు మాత్రమే. ప్రకటన అంతటిలో యిదే పద్ధతి. [22]"పరిశుద్ధుల ప్రార్థనలు" అనే ప్రయోగంపైన కామెంట్ల కొరకు "యోగ్యమైన గొఱ్ఱెపిల్ల" అని ఈ పుస్తకంలో కన్పించే పాఠంలోని 5:8 మీద నోట్సు చూడు. [23]"అతిపరిశుద్ధ స్థలము" అని KJV పిలుస్తుంది. [24]దహన బలిపీఠము మీద నిప్పులు ఎల్లప్పుడు ఉంటాయి. ధూపపు బలిపీఠము మీద ఉండవు; ఈ విధంగా ఈ లేఖనంలో సూచింపబడిన బలిపీఠము దహన బలిపీఠము కావచ్చు. [25]NASB "సాక్ష్యపు మందసము" అని పిలుస్తుంది. [26]అతిపరిశుద్ధ స్థలానికి సువర్ణ ధూపవేదిక ఎంత సన్నిహిత సంబంధం కలిగి ఉంటుందంటే, హెబ్రీ పత్రిక రచయిత దానిని అతిపరిశుద్ధ స్థలంలో ఉన్నట్టే చిత్రించాడు (హెబ్రీయులకు 9:3, 4 చూడు). [27]ఇది సింబాలిజం అనే విషయం జ్ఞాపకం ఉంచుకో. ఈ లేఖన భాగంలో సింబాలిక్‌గా ఉపయోగించిన ధూపాన్ని చూచి ఆరాధనలో ధూపం వేయడాన్ని సమర్థించదు. "యోగ్యమైన గొఱ్ఱెపిల్ల" అని ఈ పుస్తకంలో కన్పించే

పాఠంలోని 5:8పై నోట్సు చూడు. [28]Leon Morris, *Revelation;* rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 118. [29]పాత నిబంధనలో బలులకు సంబంధించి "sweet savour" (KJV), "soothing aroma" (NASB), లేక "pleasing aroma" (NIV), తెలుగులో "ఇంపైన సువాసనగా" అని ఉంది (ఉదాహరణకు, ఆదికాండము 8:21; నిర్గమకాండము 29:18; లేవీయకాండము 1:9; సంఖ్యాకాండము 15:7; యెహెజ్కేలు 20:41లను చూడు). AB ఈ ప్రయోగాన్ని ఈ మాటలతో పెంచుతుంది: "ఆయన హృదయానికి తృప్తి కలిగించే సువాసన." Judsoniaలోని నా క్లాసులో, ఈ భాగంవరకు నేను వచ్చిన తరువాత, వారికి ఏది సువాసనగా ఉంటుందని నేను అడిగాను పలు జవాబులు ... వచ్చాయి. [30]"It" అనేది ఒరిజినల్ లేఖనంలో లేదు. దూత ధూపద్రవ్యం అగ్నితో నింపి పడవేశాడా లేక కేవలం అగ్నినే పడవేశాడా? ఈ విషయంలో అంత స్పష్టంగా ఉండలేదు, ఫరవాలేదు.

[31]ఈ పాఠంలో "భూనివాసులు" అనే ప్రయోగం మీద నోట్సు "తనకు కలిగిన దానితో చేయగలిగింది చేస్తున్న సంఘం" అనే పాఠం ముందుగా ఈ పుస్తకంలో కన్పిస్తుంది చూడు. [32]ఈ దృశ్యం యెహెజ్కేలులోని దృశ్యాన్ని పోలి ఉంది. అందులో, కెరూబు రెక్కల మధ్యనున్న నిప్పులు ... తీసికొని పట్టణము మీద చల్లుమని అవిసెనార బట్టలు ధరించుకున్నవాడు ఆజ్ఞాపించబడ్డాడు (యెహెజ్కేలు 10:2). భాష తీర్పుకు సంబంధించిన భాష. [33]"మహా దినము ... వచ్చెను" అనే పాఠంలో 6:12పై కామెంట్స్ చూడు. [34]ఏడు బూరలు వాటి ఉద్దేశమును గూర్చి రాబోవు స్టడీలో చూద్దాం. [35]Peterson, 87. [36]Thomas F. Torrance, *The Apocalypse Today* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 60-61. [37]D. T. Niles, *As Seeing the Invisible: A Study of the Book of Revelation* (New York: Harper & Brothers, Publishers, 1961), 64. [38]Burton Coffman, *Commentary on Revelation* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1979), 182. [39]Homer Hailey, *Revelation: An Introduction and Commentary* (Grand Rapids, Mich.: Baker Book House, 1979), 214. [40]Peterson, 95.

[41]Torrance, 61. [42]Earl Palmer, *1, 2, 3 John & Revelation,* The Communicator's Commentary Series, vol. 12 (Dallas: Word Publishing, 1982), 185-86. [43]Barclay, 39-41.

---

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. ప్రకటన 8:1-6 ఏ మూడు ఉద్దేశాలను నెరవేర్చుతుంది?
2. ఈ పాఠం ప్రకారం, ఏడు బూరలు ఏడు ముద్రలను వెంబడించడం మాత్రమే గాక, "ఏడవ ముద్ర యొక్క ప్రాథమిక పనిగా కూడ భావించవచ్చును" అంటే దాని అర్థమేమి?
3. ఈ పాఠం ప్రకారం, ముద్రలు, బూరలు, పాత్రల యొక్క కార్యసిద్ధి ఏమి? (దీనంతటి అర్థమేమి అనేదాని విషయం కలత చెందకు. ప్రస్తుతానికి ఆలోచనను మనస్సులోనికి తెచ్చుకో.)
4. ప్రకటన 8:1లోని "నిశ్శబ్దం" యొక్క ప్రాముఖ్యతను గూర్చి నీవేమను కుంటున్నావ్?
5. క్రైస్తవుల ప్రార్థనను దేవుడు ఆలకిస్తాడని బైబిలు బోధిస్తుందా?
6. గుడారము మరియు దేవాలయపు ఆరాధనలో, బంగారు బలిపీఠమేమి? గుడారము మరియు దేవాలయపు ఆరాధనలో సువర్ణ ధూపవేదికపై ధూపము ఎలా వేయబడుతుందో చర్చించడానికి సిద్ధపడు.
7. ఈ పాఠం ప్రకారం, ధూపద్రవ్యాన్ని పరిశుద్ధుల ప్రార్థనలతో కలపడంలో ప్రాముఖ్యత ఏమి?

8. నేటి మన ఆరాధనలో ధూపం వేయాలని ప్రకటన 8 సూచించే వాస్తవము యొక్క భావమూ?
9. దేవుని యొద్దకు చేరిన ప్రార్థనలకు పరలోకపు జవాబేమి?
10. క్రైస్తవుల ప్రార్థనలకు పరలోకం యింకను జవాబిస్తుందా? దేవుడు నీ ప్రార్థనలకెప్పుడైనా బదులిచ్చాడా?



**ధూపవేదిక ముందున్న దూత (8:4)**